క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేలకొండపల్లి: నేలకొండపల్లి 11 కేవీ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కె.రామారావు తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

'పాటిబండ్ల'కు పలువురి పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ఆల్ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణారావు సతీమణి అనంతరాములమ్మ(80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు ఖమ్మం సారథినగర్‌లోని వారి నివాసంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు కళ్యాణం నాగేశ్వరరావు, ఎల్.గోపీచంద్, మాధవరావు, రామారావు, శ్రీధర్, టీఎస్.రావు, శ్రీనివాసరావు తదితరులు అనంతరాములమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కాగా, ఆమె భౌతికకాయాన్ని శనివారం ఉదయం మమత మెడికల్ కళాశాలకు అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గాయపడిన విద్యార్థికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయమందిస్తున్న అధ్యాపకులు

నేలకొండపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థి ఆజ్మిత్‌ఖాన్ పరీక్ష రాసి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం జరిగింది. దీంతో గాయపడిన విద్యార్థికి ఆధ్యాపకులు ఆర్థిక సాయమందించారు. గత నెల 25న ఇంటర్ పరీక్ష రాసి ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆజ్మిత్‌ఖాన్‌కు బలమైన గాయాలయ్యాయి. నిరుపేద విద్యార్థి కావటంతో మెరుగైన వైద్యం కోసం నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు, ఇతర సిబ్బంది స్పందించి శుక్రవారం రూ.18,500 ఆర్థిక సాయమందిచారు. ఈ కార్యక్రమంలో కాలేజీ గ్రంథపాలకులు రమాదేవి, అధ్యాపకులు డి.రవికుమార్ పాల్గొన్నారు.

పొంగులేటి విస్తృత పర్యటన



సత్యనారాయణను పరామర్శిస్తున్న పొంగులేటి

ఖమ్మంరూరల్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. కామంచికల్ గ్రామంలో బొమ్మగాని గోపాల్‌రావు కుమార్తెల ఓణీల అలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను దీవించి పట్టు వస్త్రాలను అందించారు. అదే గ్రామానికి చెందిన తొండల సత్యనారాయణ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా సత్యనారాయణను పరామర్శించారు. తొలుత పాలేరు నియోజకవర్గంలోని రామన్నపేటలో జరిగిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొని సిలువ మోసిన తర్వాత భక్తులనుద్దేశించి మాట్లాడారు. పొంగులేటి వెంట మద్దినేని బేబీస్వర్ణకుమారి, చావా శివరామకృష్ణ, ఎ.అశోక్‌నాయక్, సూదగాని ఉపేందర్, కె. చంద్రశేఖర్, ఎం. వెంకటేష్‌యాదవ్, ఏనుగు. వెంకటరెడ్డి, యాదాల లింగయ్య, ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం స్వర్ణభారతి కమ్మవారి కల్యాణ మండపంలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించే అవతార్ మెహర్‌బాబా షష్టిపూర్తి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆ ట్రస్ట్ చైర్మన్ ఆర్.రామచంద్రయ్య కోరారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భగవంతునిగా, మానవునిగా, అధ్యాత్మిక సాశకునిగా, ప్రభువుగా తదితర పాత్రల్లో ఆదర్శ ప్రాయంగా మెహర్‌బాబా జీవించారని తెలిపారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి దైవ ప్రేమికులందరూ పాల్గొని బాబా అనుగ్రహం పొందాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ట్రస్ట్ కోశాధికారి బి.సీతారాం, కార్యదర్శి ఉమాదేవి, సభ్యులు కోటేశ్వరావు, ఎన్.రవి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

9న పెరిక ఆత్మీయ సమావేశం..

ఈనెల 9న ఉదయం 10 గంటలకు గాంధీచౌక్‌లోని రాఘవ మహల్ థియేటర్ ఉమెన్స్ కళాశాల వెనుక గల లక్ష్మీశ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే పెరిక ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బందు సూర్యం, గజ్జవెల్లి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరూ పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కదిలింది.. కరుణ రథం..

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- కంటతడి పెట్టించిన సిలువ మార్గ ప్రదర్శన



మానవాళి పాప విముక్తి కోసం తన ప్రాణాలను సిలువపై అర్పించిన రోజున జరుపుకునే గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం మండలాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు మరణ ఘట్టాలను ర్యాలీల్లో ప్రదర్శించారు. పురవీధుల్లో తిరుగుతూ ఏసు పడిన శ్రమలను కళ్లకు కట్టినట్లు సిలువ మోసి ప్రదర్శించారు. అనంతరం చర్చిల్లో క్రీస్తు మరణాన్ని ధ్యానించడం, సిలువ ఆరాధన, సిలువ ముద్దు, దివ్యబలి పూజ సమర్పించడం వంటి పూజా కార్యక్రమాలు ఫాదర్లు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆర్‌సీఎం చర్చిలో ఏసుక్రీస్తు సిలువ వేసిన ఘట్టాన్ని తిలకిస్తున్న భక్తులు



రఘునాథపాలెంలో సిలువతో ప్రదర్శనగా వస్తున్న క్రైస్తవులు



కామేపల్లి: కొత్తలింగాలలో సిలువ మార్గం ప్రదర్శిస్తున్న క్రైస్తవులు



ఖమ్మం ఆర్‌సీఎం చర్చిలో సిలువ ప్రదర్శన



తిరుమలాయపాలెం: ఏలువారిగూడెంలో సిలువ మార్గం ఆచరిస్తున్న రెవరెండ్ అమృతారెడ్డి



రఘునాథపాలెం: బూడిదంపాడులో సిలువ మార్గ ప్రదర్శన..



నేలకొండపల్లి: సిలువ మార్గంలో పాల్గొన్న భక్తులు



కూసుమంచిలో సిలువ మోస్తున్న భక్తులు

సమస్యలపై సీపీఎం పోరాటం ఆగదు



మాట్లాడుతున్న కొమ్ము శ్రీను

తిరుమలాయపాలెం: మండలంలో నెలకొన్న సమస్యలపై సీపీఎం దశల వారీగా అలుపెరగని పోరాటాలు సాగిస్తుందని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. శుక్రవారం తిరుమలాయపాలెం గజ్జల వెంకటయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా ఇంకా మండలంలోని 8 గ్రామాలకు లింకు కాల్వలు లేక రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, అసంపూర్తిగా నిలిచిన చెక్‌డ్యామ్, బ్రిడ్జిలను పూర్తి చేయాలని, అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ధరణి పోర్టల్‌లో తప్పిదాలను తొలగించి రెండో దశ సాదాబైనామాను చేసి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతాంగ రుణమాఫీ చేయాలని, అప్పుల పేరుతో బ్యాంక్ అకౌంట్లను నిలుపుదల చేయొద్దని కోరారు. ఈ నెల 9న నిర్వహించే సీపీఐ, సీపీఎం రాష్ట్ర స్థాయి సదస్సుకు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నర్సయ్య, బింగి రమేష్, తుల్లూరి నాగేశ్వరరావు, వేగినాటి వెంకట్రావు, మహేందర్, వీరన్న, పద్మనాభుల సుధాకర్, నిర్మల్ రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలి

తిరుమలాయపాలెం: ఎండలో పనిచేసున్న ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, వారానికి ఒకసారి వేతనాలు చెల్లించాలని, టెంటు మెడికల్ కిట్టు అందుబాటులో ఉంచాలని, కూలీలకు సంవత్సరంలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. సోమనపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ జిల్లా అధ్యక్షులు శివలింగం, డివిజన్ కార్యదర్శి యాదగిరి, వెంకన్న, సూరమ్మ, ఉప్పలయ్య, తుపాకుల నాగేశ్వరరావు, చిరంజీవి, భిక్షం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బందెల వెంకయ్య

'మన ఊరు - మన బడి' పనులు వేగవంతం చేయండి

నేలకొండపల్లి: మన ఊరు–మన బడి పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ డీఈఈ చంద్రశేఖర్ ఆదేశించారు. మండలంలోని నాచేపల్లిలో శుక్రవారం రూ.38 లక్షలతో నిర్మించనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 22 పాఠశాలలో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అనుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈ కోటేశ్వరీ, సర్పంచ్ మందడి రాజేష్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ గో విజ్ఞాన పరీక్ష– 2023 పోస్టర్లను శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గో సేవా విభాగం బాధ్యులు డాక్టర్ కడవెండి వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ నెల 12 కల్లా ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. ఈ పరీక్ష తెలుగు, హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుందని, ఉత్తీర్ణులైన వారికి ప్రశంసాపత్రం అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు https: // gouvigya n.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి చైతన్యకిషోర్, శ్రీకృష్ణ గోశాలకు చెందిన ఆరుట్ల శ్రీరామ్, వెంకటేశ్వర గోశాలకు చెందిన కేస హనుమంతరావు, నవీన్, ఉపేందర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో బలగం చిత్ర ప్రదర్శన

ఖమ్మంమయూరిసెంటర్: కుటుంబాల మధ్య ఉండే అనుబంధాలు, కుటుంబ పెద్దలకు పిల్లలపై ఉండే ప్రేమానురాగాలను చూపిస్తూ తీసిన బలగం సినిమాను శుక్రవారం నగరంలోని 50వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ రాపర్తి శరత్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని రామాలయం వద్ద ప్రదర్శించారు. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ తెలంగాణ పల్లె కుటుంబ నేపథ్యంలో వచ్చిన బలగం సినిమా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుందన్నారు.

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యాన కాగడాల ప్రదర్శన

ఖమ్మంమయూరిసెంటర్/కూసుమంచి: బిశ్వాస్ కమిటీ ప్రకారం వెంటనే ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయాలని, టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని, ప్రశ్నాపత్రాలు లీకేజీ కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పలు డిమాండ్లతో వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంతో పాటు కూసుమంచిలో శుక్రవారం కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తుంపాల కృష్ణమోహన్, షర్మిల పీఏ నంద్యాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులు, విద్యార్థుల కోసం పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు పలు రూపాల్లో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారన్నారు. తొలి రోజు కాగడాల ప్రదర్శన నిర్వహించామని, అనంతరం రిలే నిరాహార దీక్షలు, దిష్టిబొమ్మల దహనం, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం వంటి కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలో పోటీ పరీక్షలు, పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకేజీ అవుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొన్నారు. లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు నెలకు రూ.3,016లు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, పేద విద్యార్థులపై భారం పడకుండా పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని, వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని తెలిపారు. ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు మర్రి శ్రీనివాస్, కొదాటి నరసింహా, ఆలూరి రాజవర్ధన్‌రెడ్డి, గంగరాజు, ఉదయ్‌కుమార్, ఎస్‌కె.పాషా, ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్, సురేష్, అరుణ, రత్నకుమారి, తదితరులు పాల్గొనగా.. కూసుమంచిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి పసుపులేటి సైదులు, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల అధ్యక్షులు వైవీడీ రెడ్డి, వాలూరి సత్యనారాయణ, ఎండ్లపల్లి వెంకయ్య, రూప్లానాయక్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కిషోర్ నాయక్, ఉపేందర్, రమేష్, సైదాబాబు, వేలాద్రి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో కాగడాలు ప్రదర్శిస్తున్న నాయకులు



కూసుమంచిలో కాగడాల ప్రదర్శన

వరంగల్ డిక్లరేషన్‌ను అమలు చేస్తాం

తిరుమలాయపాలెం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాహుల్‌గాంధీ వరంగల్ సభలో ప్రకటించిన డిక్లరేషన్‌పే అమలు చేస్తామని టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని కాకరవాయి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో పాల్గొని ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ చేపట్టే కార్యక్రమాలను వివరించారు. రైతాంగానికి రూ.2లక్షల రుణమాఫీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని అన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసి కొత్త విధానాన్ని అమలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం చెందిందని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న పాలేరులో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని, అందుకోసం కార్యకర్తలు అహర్నిషలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బచ్చోడు ఎంపీటీసీ పాప్యానాయక్, నాయకులు మందడి ఇజ్రాయిల్, ఉన్నం రాజశేఖర్, మల్సూర్, దేవేందర్, భద్రు, మోతీలాల్, విజయ్, బత్తుల రమేష్, ప్రసాద్, శ్రీకాంత్, సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాయల నాగేశ్వరరావు

10న పెన్షనర్ల నిరసన దీక్ష..

ఖమ్మంఅర్బన్: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన నిరసన దీక్షను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, రోటరీనగర్ యూనిట్ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం రోటరీనగర్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్యలు మాట్లాడారు. ఈహెచ్‌ఎస్ కార్డులపై ఉచితంగా వైద్యం అందించాలని, బకాయిలుగా ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీని వెంటనే ఏర్పాటు చేయాలి, 1వ తేదీనే పెన్షన్లు చెల్లించాలని, ఇన్‌కమ్ టాక్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఈ దీక్ష నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బస్వారావు, సత్యన్నారాయణ, పూర్తి చందర్‌రావు, వెంకదేశ్వరరావు, గురవయ్య, వీజీకే మూర్తి, వి.కృష్ణారావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీలకు సంబంధించి ఎన్‌ఓసీ పేరుతో ఎవరైనా డబ్బు అడిగితే అధికారులకు ఫిర్యాదు చేయాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఫ్జల్‌హసన్, ఆర్‌వీఎస్.సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. హౌసింగ్ సొసైటీ పదిహేనేళ్లు పూర్తయినందున రిజిస్ట్రేషన్లకు ఎలాంటి అడ్డంకులు లేవని తెలిపారు. అయితే, చనిపోయిన సభ్యులు, వారి కుటుంబ సభ్యుల పేరిట ఎన్‌ఓసీ ఇప్పించేందుకు కొందరు ప్రాథమిక సభ్యుల నుంచి రూ.లక్ష చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఈమేరకు డబ్బులు డిమాండ్ చేసే వారి వివరాలను కోఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జ్ శృతి మహంకాళి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాగా, టీఎన్జీవోస్‌కు హౌసింగ్ సొసైటీ, ప్రభుత్వ ఉద్యోగుల పరపతి, పొదుపు సహకార సంఘానికి ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు.

తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు..

ఖమ్మం క్రైం : సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌లో జూనియర్ అసిస్టెంట్ షేక్ అఫ్జల్ హసన్ తనపై సోషల్ మీడియా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ ఉద్యోగి ఏలూరి శ్రీనివాసరావు శుక్రవారం ఖమ్మం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమం సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొంటూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం పొందాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వెన్నపూసల సీతారాములు అంగన్‌వాడీ కేంద్రానికి విద్యుత్ సౌకర్యానికి కావాల్సిన డీడీ, మెటీరియల్, ఫిటింగ్ ఇతరాత్ర సామన్లను వితరణగా అందించగా.. సర్పంచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తులశీబాయి, వార్డు సభ్యులు దేవరశెట్టి రాము, జ్యోతిబసు, అంగన్‌వాడీ టీచర్ స్వాతి, ఆశా కార్యకర్త అరుణ, గ్రామ పెద్దలు కె.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్ రాధాకృష్ణ

తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం

ఖమ్మం వైద్యవిభాగం: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని రితన్య ఆస్పత్రిలోని తలసేమియా డేకేర్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు ఈ శిబిరంలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డి.నారాయణమూర్తి, సంస్థ కోశాధికారి ప్రొద్దుటూరి రవిచందర్‌లు మాట్లాడుతూ మే 7న సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా డే నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగా వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఈ నెల రోజుల పాటు నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో భాగంగా తొలి రోజు రక్తదానం శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 13 ఏళ్లగా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఇతర జిల్లాల్లో రక్తదాన శిబిరాలు, మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సంస్థ బాధ్యులు పి.ఉదయ్‌భాస్కర్, పి.అనిత, ఎన్.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దాతలు

అటెన్షన్ ప్లీజ్

పందులతో పరేషాన్..!



నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుతున్న పాలకులు, అధికారులు అంతర్గత సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదు. ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న వ్యర్థాల వల్ల పందులు వాటిని చెల్లచెదురు చేయడమే కాక నిత్యం అక్కడే సంచరిస్తుండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. అంతే కాక వ్యర్థాల నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానిక నివాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని బ్యాంక్ కాలనీలో పందుల సంచారం పెరిగింది. నిత్యం పందులు సంచరిస్తూ ఖాళీ స్థలాలు, కచ్చ కాల్వల్లో తిరుగుతూ స్థానికులకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. - ఖమ్మంమయూరిసెంటర్

ప్రశ్నించాల్సిన అధికారి : ఎస్‌కె.బాబు,
శానిటరీ ఇన్‌స్పెక్టర్, కేఎంసీ
సెల్ నంబర్ : 79012 98233